హైదరాబాద్
26-8-2023
సంపుటి:08
సంచిక: 352
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor: G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## అమిత్ షా ఎన్నికల శంఖారావం!

- రేపు ఖమ్మం సభలో చేసే ప్రసంగంపై అందరి దృష్టి
- బీఆర్ఎస్‌పై అనుసరించే కఠిన వైఖరిని స్పష్టం చేస్తారని అంచనా
- కేడర్‌లో జోష్ నింపేలా ప్రసంగం ఉంటుందన్న పార్టీ ముఖ్యనేతలు



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆది వారం ఖమ్మం జిల్లాలో పాల్గొనే బహిరంగ సభకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. అధికార బీఆర్ఎస్ విషయంలో బీజేపీ అనుసరించబోయే కఠిన వైఖరి గురించి, వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై సాగించబోయే పోరాటం గురించి స్పష్టతనిస్తారని తెలుస్తోంది. బీజేపీ, ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వడంతోపాటు ఇప్పటిదాకా లేనంత తీవ్రస్థాయిలో విమర్శలు సంధించడం ద్వారా అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారనే

2లో



## మార్స్ గ్రూప్ పెట్టుబడి మరో 800 కోట్లు

- రాష్ట్రంలో కంపెనీ మరింత విస్తరణ
- 1,500 కోట్లకు చేరిన పెట్టుబడులు
- హైదరాబాద్‌కు ఓమ్నికాం మీడియా
- జీబీసీ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- 2,500కు పైగా ఉద్యోగ అవకాశాలు
- తెలంగాణకు వెల్లువలా పెట్టుబడులు
- కేటీఆర్ అమెరికా పర్యటన ఫలితం

## ఆరని అసమ్మతి 'జ్వాల'

- బీఆర్ఎస్‌లో టికెట్ల ప్రకటనతో బయటపడుతున్న అసమ్మతులు
- పార్టీ జెండా లేకుండానే ఖమ్మం వెళ్లిన తుమ్మల
- నేడు తన నివాసంలో అనుచరులతో మైనంపల్లి భేటీ
- ప్రగతిభవన్ నుంచి ముత్తిరెడ్డి, చిన్నయ్యకు పిలుపు
- సీఎం కేసీఆర్‌తో చెన్నమనేని రమేశ్ భేటీ.. ప్రభుత్వ సలహాదారుగా నియామకం
- కోదాడ, స్టేషన్ ఘన్‌పూర్‌ల్లోనూరగులుతున్న అసంతృప్తి
- నర్సాపూర్ సీటుపై కొనసాగుతున్న ఉత్కంఠ

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఇతర పార్టీల కంటే ముందే ప్రకటించిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో అసమ్మతి జ్వాలలు చల్లారడం లేదు. ఒకరొకరుగా అసంతృప్త నేతలు బయటపడుతున్నారు. తమ అసమ్మతిని బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తు కార్యాచరణను



మిగతా 2లో

## రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా!

- పంజాబ్ సీఎంకు ఆ రాష్ట్ర గవర్నర్ హెచ్చరిక..
- తన లేఖలకు జవాబు ఇవ్వట్లేదని ఆరోపణ
- సీఎంపై క్రిమినల్ చర్యలు చేపడతానని అల్టిమేటం
- గవర్నర్ బీజేపీ అజెండాను అమలు చేస్తున్నారన్న ఆప్



2లో



## కేసీఆర్‌కు ఏటీఎంగా ధరణి

- ఈ పోర్టల్‌పై గ్రామాల్లో చర్చకు సిద్ధమా?
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా రద్దు చేస్తాం
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: గతంలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు కేసీఆర్‌కు ఏటీఎంగా ఉండేవని, ఇప్పుడు ధరణి పోర్టల్‌ను ఆయన ఏటీఎంగా మార్చుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మిగతా 2లో



## మీ సీఎం అభ్యర్థి ఎవరు?

- కాంగ్రెస్, బీజేపీకి కవిత సూటి ప్రశ్న.. 100 సీట్లలో గెలుపు ఖాయమని ధీమా
- సీఎం కేసీఆర్ నీడలా ఎమ్మెల్యే జీవన్‌రెడి.. జీవోల జీవన్‌రెడ్డిగా పేరు సాధించారు
- ఆర్మూర్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి
- ఆర్మూర్ గడ్డ.. కేసీఆర్ అడ్డా: జీవన్‌రెడ్డి

నిజామాబాద్,: 'మా ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్.. మరి మీ అభ్యర్థి ఎవరు?' అంటూ కాంగ్రెస్, బీజేపీలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూటిగా ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వందకుపైగా సీట్లు సాధించడం ఖాయమని ధీమా

మిగతా 2లో

## గవర్నర్‌కు రెడ్‌కార్పెట్!

### సచివాలయ ప్రధాన ద్వారం వరకూ వచ్చి సీఎం స్వాగతం, వీడ్కోలు

హైదరాబాద్,: కొత్త సచివాలయ ప్రారంభోత్సవానికి పిలవని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఇప్పుడు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా మంత్రులు, సీఎస్ తదితరులు ప్రధాన ద్వారం వరకూ వచ్చి పూల బొకేలు ఇచ్చి స్వాగతించారు. అనంతరం తమిళిసైని సీఎం కేసీఆర్ సచివాలయం లోపలికి తోడ్కొని వెళ్లారు. ఆమెను ఒక్కో ఫ్లోర్‌కు తీసుకెళ్లారు. అక్కడి గదులను చూపిస్తూ సచివాలయ నిర్మాణ వైభవాలను వివరించారు. అనంతరం, ఆరో అంతస్తులోని తన చాంబర్‌కు ఆహ్వానం పలికారు. అక్కడ గవర్నర్‌కు తేనీటి విందుతో ఆతిథ్యమిచ్చారు. దుశ్శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కూడా తమిళిసైని సన్మానించారు. చివరిగా, తిరుగు ప్రయాణమైన గవర్నర్‌కు సీఎం కేసీఆర్ సచివాలయం ప్రధాన ద్వారం వరకూ వెళ్లి వీడ్కోలు పలికారు. ఆమెకు రెండు చేతులు జోడించి సంప్రదాయ పద్ధతిలో నమస్కారం చేశారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల్లో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటి వరకూ ఉప్పు, నిప్పులా ఉన్న ముఖ్యమంత్రి, గవర్నర్ మధ్య సయోధ్య కుదిరిందనే వాదనకు తాజా పరిణామంతో బలం చేకూరిందని రాజకీయ వర్గాలు విశ్లేషించాయి. తాజా పరిణామాలతో రాజ్‌భవన్లో పెండింగులో ఉన్న బిల్లులన్నింటికీ ఇక మోక్షం

మిగతా 2లో



- ఒక్కో ఫ్లోర్‌కు తీసుకెళ్లి సెక్రటేరియట్ నిర్మాణ కౌశలంపై వివరణ
- ఆరో అంతస్తులోని తన చాంబర్లోకి ఆహ్వానం.. తేనీటి విందు.. సత్కారం
- గవర్నర్, ముఖ్యమంత్రి మధ్య సయోధ్య కుదిరిందనే వాదనకు బలం
- అంతకుముందు ప్రార్థన మందిరాలను ప్రారంభించిన తమిళిసై
- గుడి, మసీదు, చర్చి ఒకేచోట ఉన్న ప్రదేశానికి ఉత్తమ నిదర్శనమిది
- యావత్ దేశం తెలంగాణను చూసి నేర్చుకోవచ్చు: కేసీఆర్

# సంపాదకీయం

## ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు!

కిరాయి సైన్యం అధిపతి యెవ్‌గనీ ప్రిగోజిన్ బుధవారం విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని రెండు రోజుల తర్వాత రష్యా అధికారికంగా ధ్రువీకరించింది. రెండు నెలల క్రితం తిరుగుబాటు ప్రకటించి మాస్కోవైపు శతఘ్నులతో దూసుకెళ్లిన ప్రిగోజిన్ అధ్యక్షుడు పుతిన్ మినహా ఇతర ఉన్నత స్థాయి నాయకగణంపై విమర్శలు గుప్పిస్తూ వచ్చాడు. కానీ ఉన్నట్టుండి జూన్ 23న నేరుగా తన కిరాయి సైనికులతో మాస్కో దిశగా దండయాత్రకు తరలివెళ్లి అందరినీ ఆశ్చర్య పరిచాడు. బహుశా పుతిన్ మినహా మిగిలినవారిపైనే తాను ఆగ్రహిస్తున్నట్టు నమ్మించ గలుగుతున్నానని ప్రిగోజిన్ భ్రమపడి వుండొచ్చు. ఈ అలజడి పుతిన్‌ను భయోత్పాతంలో ముంచిందనీ, ఆయన అజ్ఞాతానికి పోయారనీ ప్రచారం జరిగింది. ఆ మర్నాడు మీడియాతో మాట్లాడిన పుతిన్, ప్రిగోజిన్‌ను 'నమ్మక ద్రోహి'గా అభివర్ణించారు. ఇలా ప్రకటించటం మరణ శాసనమేనని అప్పట్లో చాలామంది జోస్యం చెప్పారు. రష్యాలో లేదా విదేశాల్లో ఉంటూ విమర్శలు గుప్పించే రాజకీయ ప్రత్యర్థులు కావొచ్చు, దేశ రహస్యాలను వేరే దేశాలకు విక్రయించినవారు కావొచ్చు పుతిన్ దృష్టిలో నమ్మక ద్రోహులే. ఆ హిట్ లిస్ట్‌లోని వారిలో తప్పనిసరై ఒకరిద్దరిని జైల్లో పడేశారు తప్ప ఇంతవరకూ ఎవరినీ ప్రాణాలతో వదల్లేదు. ఇతరేతర అంశాలైతే వేరుగానీ, నమ్మక ద్రోహాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోనని గతంలో పుతిన్ చేసిన ప్రకటనను ప్రిగోజిన్ వ్యవహారంలో కొందరు గుర్తుచేశారు. నిజానికి బెలారస్ మధ్యవర్తిత్వంతో ప్రిగోజిన్ శాంతించారని, అతనికీ, ప్రభుత్వానికీ అంగీకారం కుదిరిందని ప్రకటన వచ్చినప్పుడు ప్రిగోజిన్‌కు రోజులు దగ్గరపడినట్టేనని చాలామంది అనుకున్నారు. అదే సమయంలో పుతిన్ అతన్ని క్షమిస్తారన్న విశ్లేషణలూ వచ్చాయి. ఎందుకంటే ఉక్రెయిన్‌పై ఏడాదిన్నర క్రితం దురాక్రమణ యుద్ధం మొదలెట్టాక రష్యా చేజిక్కించుకున్న పెద్ద నగరం బఖ్‌మూత్. వేరే నగరాలు చిక్కినట్టే చిక్కి చేజారగా, బఖ్‌మూత్ మాత్రం ఇంకా రష్యా నియంత్రణలోనే ఉంది. ఈ విజయం నిస్సందేహంగా ప్రిగోజిన్‌దే. అందుకే అతన్ని మళ్లీ తన దారికి తెచ్చుకుని ఉక్రెయన్‌ను ముప్పుతిప్పలు పెట్టడానికి పుతిన్ వినియోగించుకుంటారని భావించారు. కానీ ప్రిగోజిన్ తలరాతను పుతిన్ అప్పటికే వేరే రాశారు. తన 23 యేళ్ల ఏలుబడిలో పుతిన్ కఠినాత్ముడన్న పేరు తెచ్చుకోవటానికే మొగ్గుచూపారు. కానీ ప్రిగోజిన్ విషయంలో దాన్నంతటినీ తాత్కాలికంగానైనా దిగమింగి అతను క్షేమంగా వెళ్లిపోవటానికి అంగీకరించి, ఆ ఇమేజ్‌ను పోగొట్టుకున్నారు. చివరకు క్రెమ్లిన్‌లో అతని కిరాయి సైన్యంతో సమావేశమైనప్పుడు అందులో ప్రిగోజిన్ సైతం పాల్గొనటానికి పుతిన్ అనుమతించారు. ఈ ఆధునిక కాలంలో కూడా రాజ్యాలు తమ మనుగడ కోసం కిరాయి సైన్యాలపై ఆధారపడటం వింతగానే ఉంటుంది. అమెరికాలో పోలీసు విధులు కాంట్రాక్టులకు ఇచ్చే అలవాటున్నా సైన్యం విషయంలో ఆ విధానం పెట్టుకోలేదు. ఆఫ్రికా ఖండంలో ప్రస్తుతం అనేక దేశాలు ప్రిగోజిన్ సేవ లను వాడుకుంటున్నాయి. వాస్తవానికి పాశ్చాత్య దేశాల మీడియా చాన్నాళ్లుగా ప్రిగోజిన్ గురించి కథనాలు వెలువరిస్తున్నా ఆ సైన్యం ఉనికిని పుతిన్ ధ్రువీకరించలేదు. ఆఫ్రికా ఖండ దేశాల్లో అతని సైనికుల ఆగడాలపై అనేకానేక కథనాలు వచ్చాయి. ఆఖరికి ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధ సమయంలోనూ కిరాయి సేనల ఉనికిని రష్యా అధికారికంగా అంగీకరించలేదు. తమ చట్టాలు ప్రైవేటు సైనిక కంపెనీలను అంగీకరించబోవన్నదే పుతిన్ చెబుతూవచ్చిన జవాబు. కానీ జూన్ 23 నాటి తిరుగుబాటు ఈ వ్యవహారాన్ని బజారున పడేసింది. మాస్కోలో మాఫియా తరహా రాజ్యం నడు స్తోందన్న పాశ్చాత్య మీడియా ప్రచారానికి బలం చేకూర్చింది. రెండు దశాబ్దాలపైగా పుతిన్ అటు వంటి రాజ్యాన్నే నడుపుతున్నారనడానికి ఆయన వ్యతిరేకుల అనుమానాస్పద మరణాలను చాలామంది ఉటంకిస్తుంటారు. పుతిన్ అవినీతిపై కథనాలు రాస్తున్న మహిళా జర్నలిస్టు అనా పొలిటికోవ్‌స్కియాను 2006లో కాల్చిచంపారు. ఫెడరల్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ 2006లో బ్రిటన్ పరారైన అలెగ్జాండర్ లిత్వినెంకో లండన్‌లోని దుకాణంలో రేడియో ధార్మిక పదార్థం కలిసిన టీ తాగి మరణించారు. పుతిన్ అధికారానికి రావటానికి తోడ్పడిన బోరిస్ బెరిజోవ్‌స్కీ ఆయన ఆగ్రహానికి గురై బ్రిటన్ వెళ్లిపోయినా 2013లో అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 2015లో బోరిస్ నెమ్త్సోవ్ అనే భౌతిక శాస్త్రవేత్తను క్రెమ్లిన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఒకప్పుడు పుతిన్‌కు సన్నిహితంగా మెలిగి తర్వాత అతనికి బద్ధ వ్యతిరేకి అయిన అలెక్సీ నవాల్నీ సైతం 2020లో ఒక రేడియో ధార్మిక పదార్థం బారినపడ్డారు. ఆయన చచ్చి బతికాడనుకుంటే ఇప్పుడు నిరవధికంగా జైల్లో మగ్గుతున్నాడు. చట్టసభలూ, ఇతర వ్యవస్థలూ సజావుగా పనిచేస్తున్నట్టు కనబడే రాజ్యాల్లో నియంతలు బయల్దేరి వాటిని భ్రష్టుపట్టించటం, అధికారంలో శాశ్వతంగా కొనసాగేట్టు చూసుకోవటం కొత్తేమీ కాదు. కానీ పుతిన్ తీరే వేరు. రాజ్య వ్యవస్థలకు సమాంతరంగా చట్టాలతో సంబంధం లేకుండా పటిష్టమైన సొంత వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని వాటిద్వారా వ్యతిరేకులను అణచివేసే విధానం ఆయనది. ఇది అత్యంత ప్రమాదకరమైనది. ఒకప్పుడు జర్మనీ నియంత హిట్లర్‌ను మట్టికరిపించే క్రమంలో 87 లక్షల మంది సైనికులతో సహా దాదాపు 2 కోట్ల 70 లక్షలమంది ప్రాణాలు పోగొట్టు కున్న దేశానికి ఈ పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించివుండరు. ఏదేమైనా ప్రిగోజిన్ ఉత్థాన పతనాలు వర్తమాన ప్రపంచ దుఃస్థితికి అద్దం పడతాయి.



## ఎల్బీనగర్ ఎమ్మెల్యేను దూషిస్తే తగిన బుద్ధి చెప్తాం. మహిళా సంఘాల హెచ్చరిక



**ఎల్బీనగర్ ఆగస్టు 25/సమ సమాజం:** అనునిత్యం ఎల్బీనగర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పై విమర్శలు చేస్తే సహించేది లేదు..వంగ మధుసూదన్ రెడ్డి నీకు తగిన బుద్ధి చెప్తాం : ఎల్.బి.నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళల హెచ్చరిక. ఎల్బీనగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై ఈ మధ్యకాలంలో అసత్య ఆరోపణలు చేస్తూ నోటికి వచ్చిన విధంగా మాట్లాడడం పరిపాటిగా మారిందని ముఖ్యంగా చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డికి పిచ్చి పట్టినట్టుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ రోజు కర్మన్ ఘాట్ క్రాంతి క్లబ్ నుంచి వంగ మధుసూధన్ రెడ్డి వరకు మహిళలు,నియోజకవర్గ ముఖ్యనాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డికి ఈ మధ్యకాలంలో పిచ్చి పట్టిందని తను మతిస్థిమితం లేకుండా అతనేం మాట్లాడుతున్నాడో అతనికి తెలియకుండా పోతుందని ఇది ఇలాగే కొనసాగితే ఆయనను ఎర్రగడ్డ లోని పిచ్చాసుపత్రికి తరలించాల్సి వస్తుందని హెచ్చరించారు. దానిలో భాగంగా ఈ రోజు వంగ మధుసూధనరెడ్డి ఇంటి ముందు మహిళలు నిరసన ప్రదర్శనలు తెలియజేశారు. గత రెండు రోజుల క్రితం చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గ భవాని నగర్ కాలనీ నందు జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వడం జరిగింది. అట్టి కార్యక్రమంలో వారు పాల్గొనకుండా తరవాత రోజు శంకుస్థాపన కార్యక్రమానికి రావడం పట్ల నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో వారు సుధీర్ రెడ్డి మీద అసభ్య పరుషజాలంతో మాట్లాడడం జరిగింది. దానిలో భాగంగా మహిళలు మాట్లాడుతూ తనని గెలిపించిన ప్రజలను మభ్యపెడుతూ చంపాపేట డివిజన్ ను అభివృద్ధి గాలికి వదిలేసి నిత్యం ఎమ్మెల్యే పై నోటికి వచ్చినట్లుగా పరుష పదజాలంతో దూషిస్తున్నారని ఇది ఇలాగే కొనసాగితే అతి త్వరలో వంగ మధుసూదన్ రెడ్డికి తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. చంపాపేట ప్రజలకు డివిజన్ లో ఏమి అభివృద్ధి చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్న వంగ మధుసూదన్ రెడ్డి ఉన్నాడని రాబోయే రోజుల్లో డివిజన్ ప్రజలు రోడ్డుపై ఉరికించి తన్నే పరిస్థితి ఏర్పడుతుందని జోస్యం చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న శాసనసభ నియోజకవర్గాల్లో ఎక్కువ నిధులను తీసుకువచ్చిన ఏకైక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని,అటువంటి ఎమ్మెల్యేని ఇలా దూషించడం మానుకోవాలని హితవు పలికారు.

## మీసేవ సెంటర్లకు కమిషన్ చార్జీలు పెంచాలి

**మీసేవ జేఏసీ రాష్ట్ర నాయకులు అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి.**

**తొర్రూరు తహసిల్దార్ వినోద్ కుమార్ కు మీసేవ సెంటర్ నిర్వాహకుల వినతి.**



**తొర్రూరు సమ సమాజం::** గత పది సంవత్సరాల క్రితం నుండి మీసేవ సెంటర్లకు కమిషన్లు పెంచక మీసేవ సెంటర్ నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మీసేవ సెంటర్లకు కమిషన్ చార్జీలు పెంచి ఆర్థిక ఇబ్బందుల నుండి మీసేవ సెంటర్ నిర్వాహకులను ఆదుకోవాలని మీసేవ జేఏసీ రాష్ట్ర నాయకులు అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు మీసేవ సెంటర్ నిర్వాహకులు స్థానిక తహసిల్దార్ వినోద్ కుమార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితం నుండి మీసేవ సెంటర్లకు కమిషన్ చార్జీలు పెంచక పోవడంతో వచ్చే కమిషన్ లతో మీ సేవ సెంటర్ కిరాయికి కూడా సరిపోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్లు పెంచకుండానే మీసేవ సెంటర్ నిర్వాహకులపై అధిక భారం ప్రభుత్వ మోపుతుందని అన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ లు విద్యుత్ బిల్లులు ఉచితంగా చెల్లించాలని మీసేవ నిర్వాహకులకు నిబంధనలు తీసుకురావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు మీసేవ నిర్వాహకులు పూట గడవని పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. గతంలో మీసేవ సెంటర్లకు ఉన్న పలు రకాల సేవలను ప్రభుత్వం నిలిపివేసిందని... పహాని నకల్, ఆర్ ఓ ఆర్, వన్ బి పహాని లను మీసేవ సెంటర్లకు పునరుద్ధరించి నిర్వాహకులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల మీసేవ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తాసిల్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మీ సమస్యలు జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీసేవ జేఏసీ నాయకులు మూల చంద్రశేఖర్, మాచర్ల అరవింద్, ప్రవీణ్ రెడ్డి, పరమేష్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్కరణల చట్టాన్ని వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సదస్సు




**శేరిలింగంపల్లి, సమ సమాజం:** 2000 సంవత్సరం లో విద్యుత్ సంస్కరణలు, అధిక చార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష కమ్యూనిస్టు పార్టీ ల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆగష్టు 28 తరలివచ్చిన ప్రజలపై నాటి చంద్రబాబు ప్రభుత్వం కర్కశంగా సాగించిన నిర్బంధం కాల్పుల్లో ముగ్గురు మరణించిఈ ఆగష్టు 28 కి 23 సంవత్సరాలు అవుతున్నా సందర్భంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకంగా బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఉదయం 10 గం ల నుంచి మధ్యాహ్నం 1 గం వరకు సదస్సు జరుపాలని శుక్రవారం ఓంకార్ భవన్ హైదరాబాదు లో యస్ యు సి ఐ (సి) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ సి.హెచ్. మురహరి అధ్యక్షతన జరిగిన వామపక్ష పార్టీల సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం లను యంసిపిఐ(యు), యస్ యు సి ఐ(సి) , ఆర్ యస్ పి, సిపిఐ ( యం యల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (యం యల్), ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ ( యం యల్) లిబరేషన్, పార్టీలు సమిష్టిగా ఈ సదస్సు జరుపాలని నిర్ణయం చేసినట్లు సమావేశం అనంతరం యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, యస్ యు సి ఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహచ్ మురహరి, ఆర్ యస్ పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## సమర్థులైన స్థానిక అభ్యర్థులే లేరా?

- స్థానికేతరులకే పార్టీలు ఎందుకు అవకాశం ఇస్తున్నాయి?
- బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతి
- జనగామ జిల్లాలో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులకే అవకాశమివ్వాలి
- జనగామ జిల్లా బీఎస్పీ ఇంచార్జీ నీర్మాల రత్నం డిమాండ్



**జనగామ ఆగస్టు25 : సమ సమాజం:** జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీపీ మండల్ జయంతి కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జి జేరిపోతుల కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి నిర్మాల రత్నం హాజరై మాట్లాడుతూ.. మా భూములు మాకే, మా నీళ్లు మాకే, మా కొలువులు మాకే , మా పదవులు మాకేనని కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానికులను విస్మరించి స్థానికేతరులకు పట్టం కడుతున్న తీరు సిగ్గుచేటని, బీఆర్ఎస్ పార్టీలోని స్థానిక నాయకులలో సమర్థులే లేనట్లుగా స్థానికేతరులకే ఎమ్మెల్యే టికెట్లు కేటాయించడం హేయమైన చర్య అని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జీ నీర్మాల రత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నీర్మాల రత్నం బీపీ మండల్ చిత్రపటానికి నివాళులు అర్పించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా పార్టీలోనికి జనగామ పట్టణానికి చెందిన పలువురు నాయకులు చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేసేవిధంగా ప్రభుత్వాలు ప్రయత్నం చేయడం లేదని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కావాలంటే అది కేవలం బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతనే సాధ్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలతో పాటు, ప్రత్యేకించి జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కేటాయించిన తీరు చూస్తుంటే కొట్లాడి సాధించుకున్న తెలంగాణ కొందరి చేతుల్లో బందీ అయిందనేది స్పష్టమైతుందన్నారు. జనగామ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులలో సమర్థులైన స్థానిక అభ్యర్థులే లేరా అని ప్రశ్నించారు. స్థానికేతరులకు సీట్లు కేటాయించిన బీఆర్ఎస్ పార్టీ పట్ల స్థానిక నాయకులు ఆలోచన చేయాలని, స్థానికులకు అవకాశాలు ఇవ్వని పార్టీని పాతరపెట్టాలని పిలుపునిచ్చారు. బెహెన్జీ మాయావతి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 70 స్థానాలు బీసీలకు, అది కూడా స్థానికులకే కేటాయించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. జనగామ జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ,మత మైనారిటీ, అగ్రవర్ణాల పేదలంతా ఒక్కసారి ఆలోచించి స్థానికేతరులను తరిమికొట్టి స్థానిక నాయకులకు అవకాశమిస్తున్న బహుజన్ సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మడిపడిగ చంద్రశేఖర్, జనగామ మండల ఇన్చార్జి జేరిపోతుల మల్లేశం, జనగామ మండల నాయకులు నీలాద్రి, బండ సామ్యూల్, దండే మోహన్, జేరిపోతుల ప్రభాకర్, పులి పవన్, శేఖర్, గంధమాల శ్రీకాంత్ బోట్ల కేశవులు, గంధమాల సుందర్, బంధారపు శ్రవణ్, మారపాక సురేందర్, మిద్దపాక క్రాంతి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరని అసమ్మతి 'జ్వాల'

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరికొందరు అసంతృప్తులు రహస్య భేటీలతో పార్టీ, అభ్యర్థులపై ఒత్తిడి పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంకొందరు పార్టీలో ఉంటామంటూనే అభ్యర్థులను మాత్రం మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. టికెట్ దక్కించుకున్న నేతలతో సయోధ్య కుదుర్చుకునేందుకు అసమ్మతి నేతలు ససేమిరా అంటుండటం చర్చనీయాంశంగా మారుతోంది.



**బీఆర్ఎస్ జెండా లేకుండా భారీ ర్యాలీగా**

పాలేరు టికెట్ ఆశించిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆ పార్టీ అధినేత కేసీఆర్ రాయబారానికి మెత్తబడిన సూచనలు కనిపించడం లేదు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మిర్యాలగూడ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు రెండు రోజుల క్రితం తుమ్మలను కలసి కేసీఆర్ సందేశాన్ని అందించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లిన తుమ్మలకు.. ఆయన అనుచరులు జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద భారీ స్థాయిలో స్వాగతం పలికారు. ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే ఎక్కడా బీఆర్ఎస్ జెండా కనిపించలేదు. తాను ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేయకూడదనుకున్నా.. ప్రజల స్పందన చూసి మనసు మార్చుకుంటున్నట్టు తుమ్మల ప్రకటించారు. అయితే ఏ పార్టీలో చేరేదీ వెల్లడించలేదు.

**నేడు అనుచరులతో మైనంపల్లి భేటీ**

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శనివారం హైదరాబాద్ శివార్లలోని దూలపల్లిలో ఉన్న తన నివాసంలో అనుచరులతో భేటీ అవుతున్నట్టు ప్రకటించారు. తన కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంపై ఆగ్రహించిన మైనంపల్లి.. మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై కఠిన చర్యలు ఉంటాయని బీఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. కేసీఆర్ ఏ తరహా నిర్ణయం తీసుకుంటారనేది ఇంకా తేలలేదు. మరోవైపు మైనంపల్లి పార్టీని వీడే పక్షంలో ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి కోడలు విజయశాంతి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల రాజేందర్ తదితరుల పేర్లు బీఆర్ఎస్ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.

**ప్రగతి భవన్‌కు నేతల క్యూ**

బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో చోటు దక్కని పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు ప్రగతిభవన్‌కు క్యూకట్టారు. జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ శుక్రవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. వేములవాడ టికెట్‌ను వేరేవారికి ప్రకటించిన నేపథ్యంలో చెన్నమనేని రమేశ్‌కు మరో రూపంలో అవకాశమిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి రమేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ వ్యవహారాల సలహాదారుగా కేబినెట్ హోదాలో నియమిస్తున్నట్టుగా ప్రకటన వెలువడింది. అనంతరం రమేశ్ నివాసానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ వెళ్లి మాట్లాడారు.

- ఇక టికెట్ల కేటాయింపులో జనగామ, నర్సాపూర్‌లలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి శుక్రవారం మరోమారు ప్రగతిభవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిశారు.
- మరోవైపు బెల్లంపల్లి టికెట్‌ను తిరిగి దక్కించుకున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం అకస్మాత్తుగా తన కార్యకలాపాలను రద్దు చేసుకుని ప్రగతిభవన్‌కు రావడం చర్చనీయాంశమైంది.
- టికెట్ దక్కని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి నేత నల్ల మనోహర్‌రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు ప్రకటించారు. కోదాడ అసమ్మతి నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు.
- రామగుండం, ఎల్‌బీనగర్, నాగార్జునసాగర్, పటాన్‌చెరు, మధిర, దేవరకొండ తదితర నియోజకవర్గాల్లోనూ అసమ్మతి ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇంకా పార్టీ నేతలకు అందుబాటులోకి రావడం లేదని సమాచారం.

# అమిత్ షా ఎన్నికల శంఖారావం!

(మొదటి పేజీ తరువాయి)

విశ్వాసాన్ని పార్టీనేతలు వ్యక్తంచేస్తున్నారు. కొంతకాలంగా పార్టీలో ఏర్పడిన స్తబ్ధతను బద్దలుకొట్టడంతోపాటు రాష్ట్ర నాయకత్వాన్ని, కేడర్‌ను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసి పార్టీని ఎన్నికల కదనరంగంలోకి దూకేలా చేస్తారని పార్టీవర్గాలు భావిస్తున్నాయి. కేసీఆర్ సర్కార్ అప్రజాస్వామిక పోకడలు, నియంతృత్వ విధానాలను తీవ్రస్థాయిలో ఎండగట్టడంతోపాటు అవినీతి, అక్రమాలపై చర్యలు తప్పవని అమిత్ షా స్పష్టం చేస్తారని అంచనావేస్తున్నారు. వారసత్వ రాజకీయాలు, మైనారిటీ సంతుష్టికరణ విధానాలు, అవినీతి, కుంభకోణాలకు ఊతమిచ్చేలా సాగుతున్న పరిణామాలపై గట్టిగా నిలదీస్తారని భావిస్తున్నారు. బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ద్వారానే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరుగుతుందనే సందేశాన్ని ప్రజలకు ఇస్తారని అంటున్నారు.

**బీఆర్ఎస్ వైఖరిపై స్పష్టత**

ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా అమిత్‌షా ప్రసంగం ఎలా ఉండబోతున్నదన్న దానిపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. మరీ ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఈ రెండింటి మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందంటూ సాగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టేలా కేసీఆర్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు సంధిస్తారని చెబుతున్నారు. గత నెల 8న వరంగల్‌లో ప్రధాని మోదీ బహిరంగ సభ తర్వాత దాదాపు 50 రోజుల తర్వాత జరుగుతున్న ఈ సభ ద్వారా అమిత్ షా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

**ఇదీ అమిత్ షా షెడ్యూల్**

ఈనెల 27న ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు గన్నవరంలో దిగి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో భద్రాచలం చేరుకుంటారు. భద్రాద్రి ఆలయంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో భద్రాచలం నుంచి ఖమ్మంకు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం బీజేపీ రాష్ట్రకోర్ కమిటీ, ముఖ్యనేతలతో సమావేశమవుతారు. సాయంత్రం 5.45 గంటల ప్రాంతంలో ఖమ్మం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి అహ్మదాబాద్‌కు వెళతారు.

# మార్స్ గ్రూప్ పెట్టుబడి మరో 800 కోట్లు

హైదరాబాద్,: ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు అమెరికా పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ కొనసాగుతున్నది. శుక్రవారం రాష్ట్రానికి రెండు పెట్టుబడులు వచ్చి చేరాయి. ఇప్పటికే తెలంగాణలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ప్రముఖ అంతర్జాతీయ సంస్థ మార్స్ గ్రూప్ అదనంగా రూ.800 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. మరోవైపు ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 'ఓమ్నికాం మీడియా గ్రూప్' హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను నగరంలో ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో సుమారు 2,500 మందికి ఉపాధి లభించనున్నది. అమెరికా పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ శుక్రవారం న్యూయార్క్‌లో రెండు కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. పెంపుడు జంతువుల (పెట్స్) తినే ఆహార ఉత్పత్తుల్లో సుప్రసిద్ధమైన మార్స్ గ్రూప్ నుంచి చీఫ్ డాటా అండ్ అనలిటిక్స్ ఆఫీసర్ శేఖర్ కృష్ణమూర్తి బృందంతో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విస్తరణ ప్రణాళికలను, నూతన పెట్టుబడి వివరాలను సంస్థ ప్రకటించింది. తెలంగాణలో ఇప్పటికే సిద్దిపేట కేంద్రంగా కొనసాగుతున్న తమ పెట్టుబడి, కార్యకలాపాల అనుభవాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. భారత్‌లో తమ ఉత్పత్తులకు అద్భుతమైన స్పందన వస్తుందని పేర్కొన్నది. పెట్ కేర్, పెట్స్ ఫుడ్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందన్న అంచనాల నేపథ్యంలో తెలంగాణ కేంద్రంగా మరింత విస్తరించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ఉత్పత్తి ప్లాంట్‌ను విస్తరించటంతోపాటు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అగ్రికల్చర్ సైప్లై చైన్, ఇన్నోవేషన్ అండ్ సస్టైనబిలిటీ వంటి వివిధ రంగాల్లోనూ తమ కార్యకలాపాలు విస్తరిస్తామని వివరించింది. కంపెనీ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మార్స్ గ్రూప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణకు కొత్త కంపెనీల పెట్టుబడులు రావడానికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు మరింత పెట్టుబడి పెట్టడానికి అంతే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే తెలంగాణ కేంద్రంగా పనిచేస్తున్న అనేక కంపెనీలు పెద్దఎత్తున తిరిగి రాష్ట్రంలో విస్తరణకు పెట్టుబడులు పెడుతున్నాయని

# మీ సీఎం అభ్యర్థి ఎవరు?

వ్యక్తం చేశారు. 2014లో 63 స్థానాలు, 2018లో 88 స్థానాల్లో గెలిచిన తాము.. ఈ సారి 100కుపైగా సీట్లు గెలవడం తథ్యమని చెప్పారు. ఒకేసారి 115 మందితో అభ్యర్థుల జాబితా విడుదల చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు సీఎం అభ్యర్థి ఎవరో, నియోజకవర్గాల్లో అభ్యర్థి ఎవరో తెలియని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని విమర్శించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మూడోసారి టికెట్ ఖరారైన తర్వాత శుక్రవారం తొలిసారిగా నియోజకవర్గానికి రాగా, 44వ జాతీయ రహదారి నుంచి వెయ్యికిపైగా బైక్‌లు, 500 కార్లతో నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద యాత్ర' కవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారికి బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానులు బహూకరించిన కత్తి దూసిన ఎమ్మెల్సీ కవిత విజయ సంకేతం చూపించారు.

**అసలు సిసలైన ఉద్యమకారుడు జీవన్‌రెడ్డి**

ఉద్యమంలో పని చేసిన జీవన్‌రెడ్డి కావాల్నా.. వేరే వారు కావాల్నా ఆలోచించాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. రాష్ట్రంలో తొలిసారిగా రూ.160 కోట్లతో మంచినీటి పథకం ఆర్మూర్‌కే దక్కిందని, ఆ తర్వాతే రాష్ట్రమంతటా అమలైందని గుర్తుచేశారు. 2014లో జీవన్‌రెడ్డికి 15 వేల మెజార్టీ వచ్చిందని, రెండోసారి 30 వేల ఓట్లతో గెలిచాడని, మూడోసారి 60 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. మెజార్టీ పక్కానా.. అంటూ కార్యకర్తలను కవిత అడుగగా వారు చప్పట్లు కొట్టి పక్కా అని పేర్కొన్నారు. ఏడాదిన్నరగా 24 గంటలపాటు కేసీఆర్‌నీడగా ఉంటూ జీవన్‌రెడ్డి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. జీవన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత ఆశీర్వాదం తోడైందని పేర్కొన్నారు. లలిత తరఫున వచ్చిన ఓట్లన్ని జీవన్‌రెడ్డికి వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని జీవోల జీవన్‌రెడ్డిగా కవిత అభివర్ణించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరించి ప్రజల వద్దకెళ్లి నిజాయతీగా కార్యకర్తలు ఓట్లు అడగాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు.

**ఆర్మూర్ గడ్డ కేసీఆర్ అడ్డా: ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**

ఆర్మూర్ గడ్డ కేసీఆర్ అడ్డా అని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చెప్పారు. ఇక్కడ బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిందని, తనపై పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే కరువయ్యారని తెలిపారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఘన స్వాగతం**

కొల్లాపూర్/వైరా టౌన్, ఆగస్టు 25 : బీఆర్ఎస్ టికెట్ ఖరారైన తరువాత తొలిసారి నియోజకవర్గాలకు చేరుకున్న అభ్యర్థులకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. 420 కార్ల భారీ కాన్వాయ్‌తో నియోజకవర్గంలో ఎమ్మెల్యే అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అడుగడుగునా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనపై పూలవర్షం కురిపించారు. పటాకుల మోతలు హోరెత్తించారు.

# రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా!

చండీగఢ్, ఆగస్టు 25: తాను పంపించిన లేఖలకు సమాధానం ఇవ్వకపోతే రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మన్‌ను ఆ రాష్ట్ర గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ హెచ్చరించారు. అంతేకాదు, స్వయంగా ముఖ్యమంత్రి మన్‌పై క్రిమినల్ చర్యలు చేపడతానని కూడా పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంకు బన్వరీలాల్ శుక్రవారం ఒక లేఖ రాశారు. 'గతంలో నేను మీకు రాసిన లేఖలకు ప్రత్యుత్తరమే లేదు. దీనిపై నేను ఆవేదన చెందాను. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య తీవ్రంగా మారింది. శాంతిభద్రతలు క్షీణించాయి. దీనిపై ప్రభుత్వ పరంగా మీరు తీసుకున్న చర్యలను నాకు తెలియజేయపోతే, రాష్ట్రంలో రాజ్యాంగ ప్రక్రియ వైఫల్యంపై ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతికి నివేదికను పంపిస్తా. ఐపీసీ 124 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపడతాను. దీనిపై నేను తుది నిర్ణయం తీసుకోకముందే నేను పంపించిన లేఖలకు మీరు జవాబు ఇవ్వాలని సూచిస్తున్నా, హెచ్చరిస్తున్నా' అని బన్వరీలాల్ పేర్కొన్నారు. గవర్నర్ నివేదికను అనుసరించి ఆర్టికల్ 356 ప్రకారం ఏదైనా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంది. తద్వారా ఆ రాష్ట్రంలో పాలన ప్రత్యక్షంగా కేంద్రప్రభుత్వం కిందికి వెళ్తుంది. రాష్ట్రంలోని పలు అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ గవర్నర్ బన్వరీలాల్ సీఎంకు గతంలో పలు లేఖలు రాశారు. 36 మంది పాఠశాలల హెడ్మాస్టర్లను విదేశీ శిక్షణ సెమినార్‌కు పంపించటంపైన కూడా ఆయన ఒక లేఖలో వివరణ కోరారు. అయితే, వీటిపై సీఎం స్పందించకపోవటంతో, తాజాగా డ్రగ్స్ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, రాష్ట్రపతి పాలన సిఫార్సు చేస్తానంటూ హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం రాసిన లేఖను మీడియాకు కూడా విడుదల చేశారు. 'రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య తీవ్రంగా మారింది. మందుల షాపుల్లో కూడా అవి దొరుకుతున్నాయని అందరూ అనుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వ పరిధిలోని మద్యం దుకాణాల్లో సైతం వాటిని అమ్ముతున్నట్లు నా పరిశీలనలోకి వచ్చింది. డ్రగ్స్‌ను విక్రయిస్తున్నాయన్న కారణంగా లూ?ధియానాలో 66 మద్యం దుకాణాలను ఇటీవల నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మూసివేసింది. పంజాబ్‌లో ప్రతి ఐదుగురిలో ఒకరు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా తన నివేదికలో వెల్లడించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వీటి ద్వారా తెలుస్తోంది. డ్రగ్స్ సమస్య నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో తెలియజేస్తూ తక్షణం నాకు నివేదికను ఇవ్వండి. సమర్థవంతంగా, నిష్పాక్షికంగా ప్రభుత్వం పని చేసేలా చూడటం రాజ్యాంగపరంగా నా బాధ్యత. కాబట్టి, నేను కోరిన సమాచారం నాకు ఇవ్వాల్సిందిగా మిమ్మల్ని అడుగుతున్నా, సూచిస్తున్నా, హెచ్చరిస్తున్నా' అని బన్వరీలాల్ పేర్కొన్నారు. గవర్నర్ అడిగిన వివరాలు సీఎం ఇవ్వకపోవటం రాజ్యాంగంలోని 167 (బీ) ఆర్టికల్ ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. 'ఇప్పటి వరకూ రాసిన లేఖలకు సమాచారం ఇవ్వకపోవటం ద్వారా మీరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు. అంతేకాదు, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కూడా వ్యవహరించారు. ఆగస్టు 1న రాసిన లేఖకు కూడా మీరు స్పందించలేదు. అంటే, నేను అడుగుతున్న వివరాలను మీరు ఉద్దేశపూర్వకంగానే ఇవ్వటం లేదు' అని ఆరోపించారు. కాగా, గవర్నర్ హెచ్చరికలపై పంజాబ్ అ?ధికారపక్షం ఆమ్‌ఆద్మీపార్టీ నాయకుడు మాల్వీందర్ సింగ్ కాంగ్ స్పందిస్తూ.. గవర్నర్ కనీస హుందాతనాన్ని అయినా పాటించాలని అన్నారు. 'ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు రాజ్యాంగపరంగా అధికారాలు లభిస్తాయి. రాష్ట్రపతి పాలన విధిస్తామన్న హెచ్చరిక ద్వారా ఆయన బీజేపీ అజెండాను వెల్లడించారు. రాష్ట్రపతి పాలన విధించాలనుకుంటే మణిపూర్‌లో, హర్యానాలో విధించండి. పంజాబ్ ప్రభుత్వం రాజ్యాంగ పరిధులకు లోబడి పని చేస్తోంది. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను వేధించాలన్న బీజేపీ అజెండా తప్ప గవర్నర్ వద్ద మరో అజెండానే లేదు' అని దుయ్యబట్టారు.

# కేసీఆర్‌కు ఏటీఎంగా ధరణి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను కచ్చితంగా రద్దు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.పి. వెంకటేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రేవంత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని దళిత, గిరిజనులకు చెందిన 35 లక్షల ఎకరాల భూములను కొల్లగొట్టారని, జిల్లా కలెక్టర్లను అడ్డుపెట్టుకుని భూములను అక్రమార్కులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌పై రాష్ట్రంలోని 12 వేల గ్రామాల్లో సభలు పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమా అని ప్రశ్నించారు. 'ధరణిని రద్దు చేస్తే రైతుబీమా, రైతుబంధు ఎలా వస్తుందని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చింది 2020లో అయితే, రైతుబంధు, బీమాలు 2018లోనే ప్రారంభమయ్యాయి. మరి అవి ఎలా వచ్చాయి'అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి కంటే మెరుగైన విధానాన్ని తీసుకువచ్చి రైతుల భూములకు రక్షణ కల్పిస్తామని, టైటిల్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య అగాధం ఉందన్నట్టుగా ఇన్నాళ్లు కేసీఆర్ ప్రజలను నమ్మించారని, ఉప్పు, నిప్పు తరహాలో వ్యవహరించారని, ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం, గవర్నర్‌లు మాట్లాడుకున్నారని రేవంత్ ఆరోపించారు.

# గిరిజనుల్లో విద్యా కాంతులు

(మొదటి పేజీ తరువాయి)

ఘనంగా స్వాగతం పలికి, ఆయనతో కలిసి నేరుగా చినమేడపల్లికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని మరడాం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఈ విశ్వవిద్యాలయం వచ్చిందని, రాష్ట్రంలో రెండవ సెంట్రల్ వర్సిటీ అని చెప్పారు. గిరిపుత్రుల జీవితాల్లో ఉన్నత విద్యాకాంతులు నింపడానికి రాబోయే రోజుల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన మిత్రుడిగా, గిరిజన పక్షపాతిగా మన గిరిజనులు ప్రపంచంతో పోటీపడేలా గొప్ప అడుగుకు బీజం పడబోతోందని చెప్పారు. తనను నిరంతరం గుండెల్లో పెట్టుకున్న గిరిజన జాతికి మీ తమ్ముడిగా, అన్నగా, బిడ్డగా రుణపడి ఉంటానన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే.. ఈ నాలుగేళ్లలో గిరిజనుల అభివృద్ధి కోసం అన్ని విధాలా కృషి చేశాం. వారిని గుండెల్లో పెట్టుకున్నాం. అన్ని విధాలా అండగా నిలబడ్డాం. వారిని తోటి ప్రపంచంలో నిలబెట్టే సంకల్పంతో అడుగులు ముందుకు వేశాం. తరతరాలుగా నిర్లక్ష్యానికి గురైన నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరుల కోసం ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకు అన్ని దశల్లోనూ అండగా నిలుస్తున్నాం.

సమ సమాజం

శనివారం 26 -8-2023

www.samasamajam.in

తెలంగాణ Sports & ఆటలు

# బీసీలకు సామాజిక న్యాయాన్ని అందించిన బిపి మండల్

**రిజర్వేషన్ల స్ఫూర్తిప్రదాత 25 ఆగస్టు జయంతి ప్రత్యేక వ్యాసం**

**వడ్డేపల్లి మల్లేశము9014206412**

భారతదేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు విద్యారంగ అంశాలలో రిజర్వేషన్ ల కు సంబంధించి స్వతంత్ర పోరాట కాలంలో కొంత కృషి జరిగినప్పటికీ, లండన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల లో అంబేద్కర్ ఈ ప్రస్తావన చేసినప్పటికీ ,సరైన మద్దతు లభించని కారణంగా ఎలాగైనా తగిన గుర్తింపు శూద్రులకు (అంటే ఓ బి సి లు) ఇవ్వాలని ఆలోచించి రాజ్యాంగంలో 340 ఆర్టికల్ ను పొందుపరిచారు. అప్పుడు మొదటిసారిగా వెనుకబడిన తరగతులు అనే పదాన్ని ఉపయోగించారు. ఎస్సీ ఎస్టీల మాదిరిగా వీరికి విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కొందరు వ్యతిరేకించడంతో అంబేద్కర్ కలతచెంది భద్రత కల్పించే విషయంలో భారత రాష్ట్రపతి చే ప్రత్యేక కమిషన్ వేసి ఆర్థిక, విద్యా, సాంస్కృతిక ,సామాజిక వివక్షతను ఎదుర్కొంటున్న వారిని ఇతర వెనుకబడిన తరగతుల లో చేర్చి వారి జనాభా దామాషా గా విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు.

**రాజ్యాంగబద్ధంగా జరిగిన కృషి**

న్యాయ శాఖ మంత్రి హోదాలో ఓబిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టాలని అంబెద్కర్ అనుకున్నప్పుడు కొందరు అడ్డుకోవడంతో తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం బీహార్లో ఓబిసి చైతన్య ర్యాలీ నిర్వహించిన ప్పుడు నెహ్రూ ప్రభుత్వం ర్యాలీ భగ్నం చేసి అంబేద్కర్ మీద రాళ్ల దాడి చేయించి అణచి వేశారు. చివరికి నెహ్రూ ప్రభుత్వం 53 లో తలొగ్గి ఓబీసీలకు గుర్తింపు అధ్యయనం కోసం కాకా కాలేల్కర్ కమిషన్ను నియమించినప్పటికి, 2935 కులాలను గుర్తించి 54 లో రిపోర్ట్ ఇచ్చినప్పటికీ దాన్ని పట్టించుకోలేదు.

**బిపి మండల్ చొరవ కృషి**

రాజ్యాంగంలో పొందుపరచిన 340 అధికరణ మేరకు 1978లో జనతాదళ్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా ఉద్యోగాలలో ఓబీసీలకు రిజర్వేషన్ల కల్పనపై రెండవ జాతీయ బీసీ కమిషన్ బిపి మండల్ అధ్యక్షతన ఇతర నలుగురు సభ్యులచే నియమించబడింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం 1951లో రాజ్యాంగ సవరణ ద్వారా సామాజిక విద్యా పరంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ల కల్పనకు బీజం వేసిన ప్పటికీ ముందుకు సాగలేదు. మొదటి రాజ్యాంగ సవరణ మేరకు ఓబీసీలకు ప్రభుత్వ విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్ల కల్పనకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక వంటి కొన్ని రాష్ట్రాలు చట్టాలు చేసినప్పటికీ ఆ రాష్ట్రాల హైకోర్టులు కొన్ని విషయాలను కారణంగా చూపి ఓబీసీ రిజర్వేషన్లను ఆపి వేశాయి. ఈ సందర్భంలో రిజర్వేషన్లు 50 % మించ వద్దని తీర్పులు రావడంతో అమలు ఆగిపోయినవి.

**మండల్ కృషి తన నివేదిక ప్రాతిపదిక**


రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ,16 ద్వారా రిజర్వేషన్ల కల్పనకు అనేక అంశాలను న్యాయస్థానం తీర్పును పరిగణనలోకి తీసుకొని న్యాయస్థానాలలో ఓబిసి రిజర్వేషన్లు ఆగిపోకుండా బిపి మండల్ నివేదికను సమగ్రంగా తయారుచేశాడు. కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని అంటే మూడు ప్రాతిపదికలు ఏర్పరుచుకున్నాడు1) సామాజిక వెనుకబాటు 12 పాయింట్లు2) విద్య వెనుకబాటుకు 4 పాయింట్లు3) ఇతర వెనుకబాటుకు 4 పాయింట్లు. దేశంలో సామాజిక వెనుకబాటుకు కులమే ప్రామాణికం కాబట్టి ఒక కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని అంటే కనీసం 11 పాయింట్లు రావాలని నిర్ధారించుకున్నాడు దేశవ్యాప్తంగా పర్యటించి మొత్తము 0బీసీల జనాభా ను 52% గా తేల్చి 3743 కులాలను ఓబీసీ గా గుర్తించి వీరి జనాభా 52 శాతం ఉన్నప్పటికీ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే బంధన మేరకు బిపి మండల్ ప్రభుత్వ విద్యా ఉద్యోగాలలో ప్రమోషన్లలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల అమలును ప్రధాన సిఫారస్ గా మిగతా 39 సిఫారసులు చేస్తూ తుది నివేదికను 31 డిసెంబర్ 1984 న రాష్ట్రపతికి సమర్పించాడు.

**బిపి మండల్ జననము ,జీవిత విశేషాలు**

భారతదేశ చరిత్రలోనే ఓబీసీలకు అగ్రతాంబూలం అందించిన బిపి మండల్ జీవిత చరిత్ర తెలుసుకోవడం చాలా ఉపయుక్తం. ఉత్తర బీహార్ లోని సహార్సా లో అత్యంత ధనికుడైన యాదవ్ జమీందారీ కుటుంబంలో 1918 ఆగస్టు 25 న జన్మించాడు. బాల్యంలో అనేక వివక్షత, ఆటుపోట్లకు గురైనప్పటికీ మొక్కవోని ధైర్యంతో ఉన్నత విద్యను అభ్యసించి 45 నుంచి 51 మధ్య కాలంలో మాదే పుర డివిజన్లో జీతం తీసుకోకుండా మెజిస్ట్రేట్ గా పనిచేసి కాంగ్రెస్ తో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. 52 లో 65 లో తన నియోజకవర్గంలో ఉన్న మైనారిటీలు దళితులపై ఉన్నత వర్గాలు, పోలీసులు, రాజపుత్రులు చేస్తున్న దాడులు అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పార్టీలో ఉండి ప్రశ్నిస్తా వాఆని ముఖ్యమంత్రి గర్జిస్తే నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ నుండి నిష్క్రమించి ఇతర పార్టీలో చేరాడు. 1968లో బీహార్ శాసన సభ్యునిగా ఎన్నికై ఆరోగ్య మంత్రిగా పని చేస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ బయట నుంచి మద్దతు ఇవ్వడం వలన ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ వాళ్ల ఆగడాల పైన విచారణ కమిటీని వేసి తన నిజాయితీని చాటుకున్నాడు. ప్రధాని ఇందిరాగాంధీ విచారణను ఆపివేయాలని ఆదేశించినప్పటికీ ముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా భావించి వదులుకొని నైతిక విలువలకు కట్టుబడి ఉన్నటువంటి మండల్ నాయకత్వంలో మండల్ కమిషన్ ఏర్పడడం వల్లనే నిజాయితీని చిత్తశుద్ధిని చాటుకుని ఓ బీసీల హక్కుల పరిరక్షణకు రిజర్వేషన్లు ప్రకటించి ఓ బీసీల స్ఫూర్తి దాత గా నిలిచారు.

**మండల్ కమిషన్ నివేదిక పై చర్చ**

1978లో జనతాదళ్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓబీసీలకు రిజర్వేషన్ల సౌకర్యం కోసం వేసిన టువంటి మండల్ కమషన్ 1984 డిసెంబర్ 31న నాటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ కు నివేదిక అందిస్తే 1990 వరకు దశాబ్దంపాటు ఆ నివేదికను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. కొటారి కమిషన్ నివేదిక విద్యారంగంపై గత 60 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురి అయినట్లు మండల్ కమిషన్ నివేదిక కూడా దశాబ్దంపాటు నిర్లక్ష్యానికి గురైంది. తిరిగి 1989లో వి.పి.సింగ్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన జనతాదళ్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని మరోమారు ప్రదర్శించి మండల కమిషన్ సిఫార్సుల లోని మొదటి సిఫారసు అయినా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనను వి.పి.సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం ఆగస్టు 7 1990 న ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికి దేశంలోని అన్ని వ్యవస్థలలో తిష్ట వేసిన ఉన్నత వర్గాలకు ఓబీసీలకు




పిడికెడు న్యాయం చేయడానికి పూనుకుంటే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రవర్ణాల వారు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. ఆత్మాహుతి ఆత్మహత్యలతో కలిసివచ్చిన అవకాశాన్ని అడ్డుకున్నారు. అప్పుడే మందిర్ మసీదు వివాదం పెద్దగా ప్రాచుర్యం లోకి వచ్చినా రాజకుటుంబానికి చెందిన ప్రధాని విపి సింగ్ తన సామాజిక బాధ్యతను అతి చతురతతో నిర్వహించినప్పటికీ కొన్ని శక్తులు, ప్రతిపక్షాలు మద్దతు ఉపసంహరించుకోవడంతో వి.పి.సింగ్ ప్రభుత్వం కూలిపోయింది. అయినా ఈ సందర్భంగా వి.పి.సింగ్ అన్న మాటలను ప్రస్తావించవలసి ఉంది. "ఓబీసీలకు ఇచ్చిన రిజర్వేషన్ల సౌకర్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించే సమస్య లేదు. ఈ ఉత్తర్వులు అమలు అయ్యేదాకా రాజధానిలో నేను అడుగు పెట్టను" అని ఢిల్లీ దాటి వెళ్లిపోయాడు. మరో సందర్భంలో ఉత్తర్వులు అమలు కోసం తుపాకీ ఉపయోగించడానికి అయినా వెనుకాడను అని విపి సింగ్ చేసిన ప్రకటనను కొంతమంది పెద్దలు గుర్తు చేస్తుంటే రాజ వంశానికి ఉన్నటువంటి ఇంగితజ్ఞానం మిగతా పార్టీలకు లేకపోవడాన్ని చింతించవలసి ఉన్నది. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి స్పందించిన సుప్రీం కోర్టు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు నిలిపివేస్తూ 16 నవంబర్ 1992 న తుది తీర్పును వెలువరించింది. రాజ్యాంగబద్ధంగా ఎంతో విజ్ఞత గా బిపి మండల్ చేసిన 27 శాతం రిజర్వేషన్లను ఆమోదించిన సుప్రీంకోర్టు సంపన్న వర్గాలను రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించాలని సూచించింది.

**పై సుప్రీం కోర్టు తుది తీర్పుకు అనుకూలంగ**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీ రిజర్వేషన్లు 1993 నుండి అమలవుతున్నాయి. బిపి మండల్ తన జీవితాన్ని దేశంలోని 27 శాతం జనాభా కలిగిన వారి ఉద్యోగ విద్యా రంగాలలో సమాన వాటా కోసం అంకితం చేస్తే, నివేదికను ఆమోదించి ఉత్తర్వులు ఇచ్చినటువంటి ప్రధాని వి.పి.సింగ్ తొలి నియామక పత్రాన్ని స్వయంగా ఇంటికెళ్లి అందించ డం ద్వారా చిరస్మరణీయులు అయినారు. మండల్ కమిషన్ అనగానే ఓబీసీ రిజర్వేషన్లు, రిజర్వేషన్ల అమలు అనగానే పదవిని కోల్పోయిన పట్టువదలని వి.పి.సింగ్,అధికారిక ఉత్తర్వులు భారత చరిత్ర ఉన్నంత కాలం నిలిచి ఉంటాయి. వడ్డేపల్లి మల్లేశం సామాజిక ,రాజకీయవిశ్లేషకులు . అధ్యక్షులు జాగృతి కళాసమితి హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట9014206412

# నిజాయితీని చాటుకున్న హెడ్ ట్రాఫిక్ కానిస్టేబుల్



**మలక్పేట్ ఆగస్టు 25/సమ సమాజం:** ఓ మహిళ పారవేసుకున్న పర్సు, ఏటీఎం కార్డులు, బంగారు నగలతో కూడిన బ్యాగును ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ గమనించి సదరు మహిళలకు ఆ బ్యాగును అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు. మలక్ పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఇ.సుధాకర్ రెడ్డి విధి నిర్వహణలో భాగంగా దిల్ సుఖ్ నగర్ టీఆర్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ మహిళ నగలు, ఏటీఎం కార్డులు, 4వేల రూపాయల నగదు ఉన్న బ్యాగును పారవేసుకున్నారు. విషయాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి సదరు బ్యాగును గమనించి ఆ మహిళకు అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు. బ్యాగును పారవేసుకున్న మహిళకు తిరిగి బ్యాగులు అందజేసి నిజాయితీని చాటుకున్న హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. నిజాయితీని చాటుకున్నందుకు అభినందించారు.

# బి ఆర్ ఎస్ లో చేరిన పలువురు వివిధ పార్టీలకి చెందిన నాయకులు



**పెద్దపల్లి ఆగస్టు 25: సమ సమాజం:**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకి చెందిన నాయకులు భారీ సంఖ్యలో గూలాబీ గూటిలో చేరారు. వీరిలో చుక్క చంద్రయ్య,లింగయ్య, కొత్తూరి రాజయ్య, కల్వల ఓదెలు, కొత్తూరి శ్రీనివాస్, జంగం శ్రీనివాస్, కల్వల స్వామి, ముదురు కోళ్ల గణేష్, కల్వల మురళి, గౌరవెల్లి రామారావు, గాట్ల కృష్ణ, శంకర్, ఆవుల కిషన్, రాజు, ఆర్కుటి పోచాలు, ఎనగందుల కనకయ్య, చొప్పరి లక్ష్మయ్య, గట్టయ్య, సదయ్య, సత్యపాల్, కల్వల అరవింద్, ఎల్లయ్య, తిరుపతి, రాము, మల్లయ్య, చంద్రయ్య, అక్షిత్, చుక్క రమేష్ లకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కండువా కప్పి భారత రాష్ట్ర సమితి లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి జిల్లా కో ఆర్డినేటర్ కాసర్ల అనంత రెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, ఏఎంసి ఛైర్మెన్ బుర్ర మౌనిక-శ్రీనివాస్, రైతు సమితి మండల కో ఆర్డినేటర్ బోయిని రాజమల్లయ్య, మాజీ ఎంపీపీ పాల రామారావు, వైస్ ఛైర్మెన్ అన్నేడి మహిపాల్ రెడ్డి, సర్పంచ్ ఎరుకొండ రమేష్, ఎంపీటీసీ సంపత్, గ్రామ శాఖ అధ్యక్షుడు భూమయ్య, చుక్క రాజమౌళి, మొండయ్య, నారాయణ, నారాయణ, తిరుపతి, రాజేశం, శ్రావణ్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# రెండవసారి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మాలగుండ్ల శంకర్ నారాయణ



**శ్రీ సత్య సాయి ఆగస్టు 25: సమ సమాజం:** శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా పెనుగొండ శాసనసభ్యులు మాలగుండ్ల శంకర్ నారాయణ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పులగుర్లపల్లి గంగాధర్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొండ శాసనసభ్యులు మాల గుండ్ల శంకర్ నారాయణ శ్రీ సత్య సాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన శుభ సందర్భంగా పులగుర్లపల్లి గ్రామంలో గంగాధర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే పైళ్ల సహకారంతో వీధిలైట్లు ఏర్పాట్లు

**ఆగస్టు 25 సమ సమాజం:** వలిగొండ మండలం ముద్దాపురం గ్రామంలో ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి సీడీపీ నిధులతో ఒక లక్ష పదివేల రూపాయలు( 1,10,000) నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వాకిటి ధర్మారెడ్డి, మండల ప్రచార కార్యదర్శి సామ నర్సిరెడ్డి, దశరథరెడ్డి, వాకిటి చిన్న వెంకట్ రెడ్డి, రైతు కోఆర్డినేటర్ వాకిటి శ్రీనివాస్ రెడ్డి , వాకిటి గంగిరెడ్డి నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ప్రతిపక్షం వద్ద అబద్ధాలు ప్రభుత్వం వద్ద అభివృద్ధి

**సంక్షేమ పథకాలలో బి ఆర్ ఎస్ కు సాటి లేదు**

**పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**

**పెద్దపల్లి ఆగస్టు 25: సమ సమాజం:**పట్టణంలోని ప్రతీ వార్డులో ఓటర్లకు వారు పొందిన సంక్షేమ ఫలాలను తిరిగి గుర్తుచేయాలని తద్వారా బి ఆర్ ఎస్ పార్టీని ఆదరించేలా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో 50 మంది ఓటర్లకు ఒక ఇంచార్జ్ ఉండి, అనునిత్యం వారి మధ్య ఉంటూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి వివరిస్తూ వారు బీ.ఆర్.ఎస్ కు ఓటు వేసేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి కె సి ఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనే అగ్రభాగాన నిలిపి దేశం గర్వించదగ్గ స్థాయికి తీసుకువచ్చారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలందరికీ పెద్దన్నగా నిలిచారన్నారు. పెద్దపల్లి పట్టణంలో 2014 ముందు ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది అనే విషయాన్ని తిరిగి పదే పదే ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి సందర్భంలోనూ ప్రభుత్వం చేసిన సంక్షేమం %ఢ% అభివృద్ధిని వివరించాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటు అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టి, ప్రతీ ఇంటిలో ఒక సంక్షేమాన్ని అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి దక్కిందని తెలిపారు. ఇక్కడ ప్రవేశపెట్టిన పథకాలను అటు కేంద్రంలోనూ మరియు ఇతర రాష్ట్రాలను ప్రవేశపెడుతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో



ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టే విధంగా, ప్రజలను చైతన్యం చేసి, మన పాలన కోరుకునేలా చూడాలన్నారు. అభివృద్ధి అంటేనే తెలంగాణ రాష్ట్రం అని ఇతర రాష్ట్రాల ప్రజలు పేర్కొంటున్నారని, కొన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో అమలవుతున్న పథకాలను వారి రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. గత పాలకుల హయాంలో జరగని అభివృద్ధి కేవలం 9 సంవత్సరాల కాలంలో జరిగిందని ప్రస్తుతం పట్టణం సుందరీకరణంగా తీర్చి దిద్ద పడుతుందని, పట్టణంలో అన్ని రోడ్లను ఆధునికరించడంతోపాటు, పట్టణానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, మంచి నీటి సౌకర్యం, మురుగునీటి కాలువ నిర్మాణం తో పాటు, పట్టణ ప్రజలకు మంచి వైద్యం అందించేలా అధునాతన వైద్యశాల బస్తీ దవకణాలు, ప్రజలకు ఆహ్లాదం చేకూర్చేలా ఒక మంచి మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ప్రతినిధి తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంతవరకు విశ్ర మించకుండా శ్రమించాలని సూచించారు.

# పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద వరలక్ష్మి వ్రతం

**నాంపల్లి,ఆగస్టు25సమ సమాజం:** మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి గుట్ట దగ్గర పెద్దమ్మ దేవాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంభం కృష్ణారెడ్డి అధ్వర్యంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదాలు పొంది ,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తులకు పెద్దమ్మ దేవాలయం వద్ద మోర జగన్ ,ఇంద్రమ్మ యూత్, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బెల్ది సత్యనారాయణ వెంకటమ్మ యాదవ్ దంపతులు, జాల కృష్ణయ్య సునీత దంపతులు, వార్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in